హాలాహలంలో అమృతభాండం

మధురాంతకం దొరస్వామి పిళ్లై

> హాలాహలంలాంటి ... నుంచి ఈ అమృతభాండం ఎలా ప్రభవించింది? అనుకున్నాడు కృష్ణమూర్తి నీరజను చూచి.

అమ్మమ్మ హృదయం ఒక అమృత భాండం! కోటి మాతృ హృదయాల కూడలి స్థలం! మరి మెత్తని మనసూ—ఎముక లేని చేయీ అమ్మమ్మది!

మండు వేసంగిలో పయనించే పాంథులు, చల్లని నీడ నిచ్చే కానుగ క్రింద మార్గాయాసాన్ని బాపుకొన్నట్లు, బంధుప్రీతి గల అమ్మమ్మచే పోషింపబడి ఆమె అమృత హస్తాల్లో పెరిగి, రెక్కలు వచ్చిన తరువాత తల్లిని వదలివెళ్లిపోయే పక్షి పిల్లల్లాగా, నిష్క్రమించినవారు లేకపోలేదు.

అమ్మమ్మ చల్లని చూపు లేకుంటే—తనింతటివాడయేవాడు కాదు కృష్ణమూర్తి! ఈ భావన కలిగినపుడు అతని హృదయం గాలి తాకిడికి అల్లల్లాడిపోయే మాధవీ లతికలా చలించిపోతోంది. అమ్మమ్మకు దిక్కెవ్వరు? అమ్మమ్మ దేవతలాంటి మనిషి .... యీ ఆలోచనలతో అమ్మమ్మని పూవుల్లో పెట్టి పూజించాలని ఆమెకే కొరత లేకుండా చూడాలని, ఏమేమిటో ఘోషిస్తుంది కృష్ణమూర్తి హృదయం.

అది అర్ధరాత్రి, దాదాపు రెండు గంటల సమయమైనా అయి ఉండవచ్చు. బహుశః తానప్పుడు నిద్రాదేవి బాహులతా పంజరంలో ఒదిగి తనకేమీ యీ లోకంతో ప్రసక్తి లేనట్లు విశ్రాంతి పొందుతూను ఉండవచ్చు.

నిశ్శబ్దాన్ని చీల్చుకొని, అమ్మమ్మ కంఠంలో నుండి యీ మాటలు వెలువడినై: "పాండ్రా! ఏ మయ్యో గొయ్యో చూచుకోనుంటుంది. వెదకండి, చిట్టితల్లి ఏమైందో" తల బాదుకుంటూ రోదిస్తోంది. నిద్రమత్తు వీడింది. అయినా అయిదేండ్ల వయస్సులో అంతంత మాత్రమేమి అర్థం కాలేదు, తనకు.

అమ్మమ్మ దేనికి రోదిస్తుంది? వెదకడం దేన్ని? మున్నగు ప్రశ్నలు కృష్ణమూర్తి హృదయంలో ప్రభవింపక పోలేదు. పూరిళ్లోని

వారందరు గుమిగూడారు. తలోవిధంగా అమ్మమ్మను ఓదారుస్తున్నారు. తాతయ్య నిర్లిప్తంగా కండువా భుజంపైన వేసుకొని వంట అరుగుపై కూర్చొని శ్మశానానికి అనుచరులను పురమాయిస్తున్నాడు.

తెల్లవారుజాము నాలుగు గంటలు .... ఐదారుగురు మనుష్యులు అమ్మను చేతులపైన వేసుకొని వచ్చి పరుండబెట్టారు. ఒక్క మాటుగా అమ్మమ్మ, తాతయ్య అందరూ బావురుమన్నారు. ఎందుకో తనకప్పుడు అర్థంకాలేదు కృష్ణమూర్తికి! అమ్మ కొంచెం పొడగరి. ఆమె నిర్వికారంగా ప్రసన్న వదనంతో శయ్యపై నిద్రిస్తున్నట్లనిపించింది తనకు. ఆ రాత్రే ఏడుగంటలప్పుడు వెండి గిన్నెలో పాలుపోసి పంచదార కలిపి అన్నం తినిపించింది తనకు. సాయంకాలం మట్టి ప్రమిదలలో ఆముదం పోసి ప్రత్తితో వత్తులు చేసి, గుమ్మానికి రెండు వైపులా దీపాలు వెల్గించింది అమ్మ. తనలో కారుచీకట్లు పోకార్చి జ్ఞాన లతలను ప్రవేశింప జేసినట్లు స్ఫురణకు వస్తూంటుంది అమ్మ వెలిగించిన రెండు జ్యోతులు. అమ్మను వదిలి పరుండడం తనకెట్టే అలవాటు లేకపోయినా! అమ్మమ్మ ప్రక్క పరుండడం అనేది ఒక్కొక్కరోజు జరుగుతూంటుంది. ఆనాడు అమ్మమ్మ దగ్గర నన్ను పరుండబెట్టి నిద్రపోయే వరకు చేతితో తట్టుతూ ఉంటుంది అమ్మ. ప్రస్తుతం పరిస్థితి యేమిటో? అర్థంకాక, కృష్ణమూర్తి మోము వెలవెల పోయింది.

తాతయ్య గ్రామకరణం కావటం మూలాన గ్రామంలో మేటి రైతులందరూ ఆ రాత్రికి రాత్రే తన యింటికి హాజరైనారు. ఒక హరికెన్ లాంతరుతో .... నలుగురైదుగురు రైతులతో హాజరైన రెడ్డిగారు "కరణంగారూ, కన్న కుమార్తెను వంచనచేసి, యేం పుణ్యం కట్టుకుంటారు, మీ ముఖమైనా చూడకూడదు" అని మందలించారు. వంచన ఏమిటో అర్థమైనది కాదు ఆనాడు కృష్ణమూర్తికి!

పోలీసులు ఉదయం ఏడింటికే హాజరై అమ్మ పొడవు, గుర్తులు వ్రాసుకొని ఆమె ఎలా మరణించిందని ప్రశ్నించారు. అదివరకే తాతయ్యవద్ద ఉపదేశం పొందిన, కుమ్మర మునెప్ప "ఆమె, చిన్నబిడ్డకు బావిగట్టున గల తుందాకు కోసుకుంటూ ఉండడం క్రితం సాయంత్రము తాను చూచానని, పరధ్యానంలో ఆమె కాలు జారి నూతిలో పడడం గమనించి కేకేశానని, తనకు ఈత రాకపోవడం మూలాన జనం చేరి ఆమెను నూతిలో నుండి తీయగా అదివరకే ఆమె మరణించిందని" వాఙ్మూలం యిచ్చాడు. ఏదో కొంచెం లంచం రాళ్లతో తప్పుడు సాక్ష్యాలని తమ డైరీల కెక్కించి నిష్క్రమించారు పోలీసులు. తన యింటి ఆచారం మేరకు చనిపోయిన వారిని భూస్థాపితం చేస్తారు గాని, అగ్ని సంస్కారము చేయరు. కానీ, ఏ కారణంచేతో, అమ్మకు అగ్ని సంస్కారం జరిగింది. కారణం తనకప్పట్లో అర్థంకాలేదు.

అమ్మమ్మ అమ్మను తలపోస్తూ వేడివేడి కన్నీటి కణాలు రాలుస్తూ నిశల్లో రోదిస్తూండేది. తాతయ్య అప్పుడప్పుడూ నిర్లిప్తంగా శూన్యంలోకి చూస్తూ—దీర్ఘ నిశ్వాసాలు వదల్తూండేవాడు.

తాతయ్యకు, అమ్మ అంటే పంచప్రాణాలు—అమ్మ తాతయ్యకు ఏకైక పుత్రిక· ఆమాట కొస్తే "అమ్మమ్మకు నలుగు రైదుగురు మగ సంతానం కలిగినట్లు, అందరూ, సంవత్సరం.... రెండేళ్లూ .... పూర్తిగాక పూర్వమే మరణించినట్లూ, తుదకు, అమ్మమ్మ తాతయ్యల దాంపత్య నందనవనంలో పారిజాత పుష్పంలా భాసించింది అమ్మ" అని అమ్మమ్మ అంటూండేది.

తాతయ్య పాతకాలపు మనిషి—రామాయణ, భారత, భాగవతాలు వీధిబడిలో బాగా అభ్యసించినవాడు. ఎవరికి ఏ ఉత్తరం వ్రాసినా, ఏమైనా సలహాలిచ్చినా ఉద్గ్రంథాల్లోని పద్యాలను, సంస్కృత శ్లోకాలను ఉదహరిస్తూ ఉండేవారు.

లేకలేక పుట్టిన కూతుర్ని కంటికి రెప్పలా కాపాడాడు తాతయ్య—సీత, సావిత్రి, అనసూయల్లాగా తన కుమార్తె ఆదర్శనారి కావాలని ఉవ్విళ్ళూరాడు. ఆమెను పాఠశాలకు పంపక పోయినా తానే తెనుగు చక్కగా వ్రాయను, చదువను, కొంత గణితజ్ఞానము కలిగించాడు తాతయ్య.

> "పొట్టి పోతరాజుకి విదూషకుడిపైన కోపంవచ్చి మరణ దండన విధించాడు. అతను మరీ ప్రాధేయపడగా ఇల్లా అన్నాడు. "నువ్వు అబద్ధం చెప్పావో తలకాయ కొట్టేస్తాం. నిజంచెప్తే ఉరితీస్తాం. విదూషకుడు వెంటనే "నా తల కొట్టేస్తారు" అన్నాడు.

ఆస్తికత్వంలో జీర్ణించుకుపోయిన భావాలపుట్ట తాతయ్య· తదనుగుణంగా రూపొందించాడు అమ్మని. ఒక అమ్మ నేమిటి? తాతయ్య పోషణలో పెరిగిన తను ఓ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడైనా, మున్ముందు కళాశాలల్లో అధ్యాపక వృత్తి నెరపడానికి తనకు అర్హతలు, అవకాశాలున్నా, తాతయ్య సంప్రదాయికమైన ఆస్తికత్వపు భావాలు యీ నవీన యుగంలోను తన ఒంటిలో నుండి వదలిపోలేదు. ఉగ్గుపాలతో రంగరించి పోసిన భావాలు కదూ? ఏలా పోతాయి! ఓ దీర్ఘ నిశ్వాసం విడిచి కృష్ణమూర్తి మరలా ఆలోచనలో పడ్డాడు.

భ్రాతృవత్సలతలో తాతయ్య భరతునికి సాటి! తన కున్న ఆరుగురు తమ్ముళ్ల బిడ్డలలో కనీసం ఐదారు మంది బిడ్డలను తానే పోషిస్తూండేవాడు తాతయ్య. తాతయ్య కడపటి తమ్ముడు సుదూర ప్రాంతాల్లో కరిణీకం చేస్తూ బాగా రెండు చేతులా గడిస్తూండేవాడు. మాటకు, మూటకు, ఆ సంసారాని కంతకూ ఆయనదే మాటగా ఉండేది!

అమ్మకు సంబంధం—ఆ చిన్న తాతయ్య తీసుకొని వచ్చిందే! ఓ ప్రాథమిక పాఠశాలోపాధ్యాయునికి తన అన్న కుమార్తెను (అమ్మను) ఇప్పించి ఆ పంతులు చెల్లెలిని వివాహ మాడాడు, చిన తాతయ్య!

నాన్నగారికి, పెదనాన్నగారికి వచ్చిన తగాదా మూలంగా నాన్న అమ్మతో సహా తన అత్తారిల్లు చేరాడు. ఆ దరిదాపుల్లో పంతులు ఉద్యోగం నెరపుతూ ఉండే నాన్నను సుదూర ప్రాంతాల్లో ఒక పల్లెటూరులో సింగిల్ టీచరుగా మార్పు చేశారు. ఆ క్రొత్త పరిసరాలలో అమ్మతో కాపురం ప్రారంభించి కొన్ని సంవత్సరాలు ఆ కుగ్రామంలో గడిపారట నాన్న. బడిపంతుళ్లంటే దేవుళ్లలా ప్రజలు చూసుకొనే రోజు లవి. పూర్వపు తాలూకా బోర్డుల కాలం! గ్రామస్థుల సహకారంతో ఏ లోటూ లేకుండా జీవనం గడుస్తూ జీతం రాళ్ళు అట్టే మిగిలిపోయేవట.

నాన్న జీవితంలో పెను తుఫానులా వచ్చింది ట్రాన్స్‌ఫర్ చినతాతయ్యగారి వూరికి. ఆ వూరికి ట్రాన్స్‌ఫరై నాలుగు మాసాలు గడిచింది. నాన్న తన చెల్లాయి యింట్లో అవిభక్తంగా ఉండడం తనకు నచ్చక మార్పుకు అర్జీ పెట్టుకొన్నాడు. దేవరకొండకు ట్రాన్స్‌ఫర్ ఆర్డరు వచ్చింది.

డ్యూటీలో చేరి వారమైనా తిరుగలేదు. అమ్మను చిన తాతయ్య గృహంలో వదలి వెళ్లాడట—జ్వరంతో తిరిగి వచ్చిన నాన్న గట్టిగా మంచం పట్టి ఎనిమిది రోజుల్లోనే ఈ ప్రపంచాన్ని శాశ్వతంగా వదలాడట!

చినతాతయ్య మాత్రం నాన్నగారికి జబ్బు నయం చేయడానికి ఓ డాక్టర్ని యింటిలోనే ఉంచి ఎనిమిది రోజులుగా చికిత్స చేయించి తన ముద్దుల మరిదిని జీవింప చేయడానికి, ఎంతో ప్రయత్నం చేశాడు.

"రిష్లాక్సు ఫీవర్. ఇది మరీ సీరియస్" అని డాక్టరు తొలుతనే పెదాలు విరచారట. ఈనాడు లాగా మంచి ఔషధాలు లేని రోజు లవి. ఏమైతే నేం! పుట్టించినవాడు రమ్మన్నప్పుడు ఔషధాలేం జేస్తాయి గనుక! ఏమైతే నేం. నాన్న యిక లేడు .... అమ్మ ఆక్రందనాలకు అంతమే లేదు.

తాతయ్య ప్రాచీన భావలహరిలో ప్రభవించిన అమ్మ యీ యిరవయ్యో శతాబ్దం ప్రథమ పాదంలో సైతం సహగమనానికి .... తాతయ్య నర్థించింది. తాతయ్యయితే అందుకు అంగీకరించేవాడే! పైగా అగ్నిగుండం పైన్నే విమానంలో అదృశ్య రూపంలో తన అల్లుడు తన కుమార్తె కోసం ఎదురు చూస్తుంటాడని, కుమార్తె సహగమనం చేయగానే ఆమె ఆత్మ అతనిని చేరి వారి విమానం నేరుగా వైకుంఠ ధామం చేరుతుందని ఆయన ప్రగాఢ విశ్వాసము అయి ఉండవచ్చు!

అదివరకే పతిత మానవోద్ధరణకై యిలాతలంలో రాజా రామమోహన్‌రాయ్ ప్రభవించి సహగమన దురాచారాన్ని రూపుమాపి ఎన్నో ఏండ్లు గడిచినది! తాతయ్య అమ్మ కోరికను మన్నించాడా, తాను కుటుంబంతోపాటు శ్రీకృష్ణ జన్మస్థానం అలంకరించడమో లేక అంతకంటే కఠిన

శిక్షే ప్రభుత్వంచేత విధింప బడుతోంది. అందుకే సహగమనానికి మద్దతు నిచ్చే ధైర్యం ఎవరికుంటుంది గనుక !

చిన్నతనంలో పురాణాలు ఉగ్గుబాలతో రంగరించి పోసినాడు తాతయ్య .... ! తన జీవితం దేనికి ? తన తనువు, మనసూ ఎవరికి ? వైధవ్యంతో ఉన్న స్త్రీలంటే సంఘానికి బహుచుల్కన. వారి మోము చూచినా పాపం అని తలచే రోజులవి.

తనెందుకు జీవించాలి ? ఏదో పరధ్యానంగా ఉంటూంది అమ్మ. ఏదో ఆలోచిస్తూ కంటిలో నుండి తన చెక్కిళ్ళ మీదుగా కారే కన్నీటి ధారను తన చేత్తో అప్పుడప్పుడూ తుడుచుకొంటూంది. పినతండ్రి మందలించినా, తండ్రి ఓదార్చినా ఆమె దుఃఖం ద్విగుణీకృత మయ్యేది.

తాతయ్య రెండెద్దుల బండిలో అమ్మను తన వూరికి తీసుకొని వెళ్ళాడు. నాన్న పోగా అమ్మ పోషణ భారం అంతా తాతయ్యపై బడింది. ఆమాట కొస్తే అమ్మ తనికి ఏకైక పుత్రిక. తనకు మగ సంతతి లేక పోవడం మూలాన అమ్మ పోషణ భారం అతను వహించవలసి నందుకు తాతయ్య భయపడ్డం లేదు. కానీ తాతయ్య బంధుప్రియుడు.

అన్న కుమారులైనా, తన కుమారులైనా ఒకటే నన్న భావన తాతయ్య మదిలో అలుముకొని పోయింది. తన అన్న కుమారుడు ఆనందరావు పాతికేళ్ల వానికి ఓ మంచి సంబంధం అని ఎంచి ఓ చక్కని చుక్క లాంటి కన్నెను తెచ్చి వివాహం చేశాడు తాతయ్య. అన్నగారన్నా, ఒదినగారన్నా ఎంతో భక్తి గౌరవాలు—అమ్మకు. ఆనందం కూడా అమ్మంటే చాలా సానుభూతితో ఉండేవాడు. అదేం చిత్రమో గాని లోకంలో అత్తకు కోడళ్లకు, ఆడబడుచులకు ఒదినగార్లకు, ఎలుకకూ పిల్లికి, ఉప్పుకు నిప్పుకు ఉన్నంత సంబంధం ఉంటుంది.

“నీకూ యీ యింటి కేం సంబంధం ? యీ యింటికి నేను గృహలక్ష్మిని” అన్నట్లున్నవి ఆమె చూపులు, భావాలు—నిర్హేతుకంగానే. దానితో పాటు తాతయ్య తదనంతరం కరిణీకం, వగైరాలు, ఆస్తి అంతా తమకే దక్కాలని, యీ యింటికి అమ్మకు ఏలాంటి సంబంధం ఉండగూడదని, ఆమె ఉండడంచేత ఆ హక్కులు కాస్త గృహమేధియైన తాతయ్య ఏం చేస్తాడో ? నని ఆనందం గారి భార్య ఆరాట పడేది. తనకు పుట్టబోయే భావి సంతానానికి ఆ గృహం, స్థిర చరాస్తులు సంక్రమించాలి. అందుకు అమ్మ ఆ యింటిలో ఉంటే ఏం సంభవిస్తుందో ? ఏకైక పుత్రిక అని తాతయ్య తన ఆస్తిలో అర్థం వ్రాసి యిచ్చినా యీయవచ్చునన్న తలంపు ఆనందం గారి భార్య మెదడులో మెదలడంతో అమ్మను అంతరంగికంగా ద్వేషించడం ద్విగుణీకృతం అయింది.

ఆనందంగారి భార్య నీళ్లకన్నా తేలిగ్గా చూస్తూంది అమ్మని. తాతయ్యకు తాను ఏకైక పుత్రిక అయినా పరాయివాండ్ల ఇంటిలో ఉన్నట్లు మథనపడసాగింది అమ్మ. తన వదిన చిన్న

హాలాహలంలో అమృతభాండం

చూపుల గురించి అన్నగారితో కాని, తన తండ్రితో గాని చెబ్తే తన వదినకు తగిన శాస్తి జరుగుతుంది ! కాని తనవల్ల అన్నగారి కాపురంలో రవరవలు లేవడం అమ్మకు సుతరామూ యిష్టం లేకపోయింది.

నాన్న మరణించడంతో ఆయన బడిపంతులుగా పనిచేసి సంపాదించిన రెండూవేల రూపాయలూ తాతయ్య స్వాధీనంలోనే ఉంది. ఆ గ్రామంలోనే మంచి మాగాణి భూమి ఆ సెలయేటి కాలువ క్రింద మూడెకరాలు రెండువేల రూపాయలకు కొనదలచుకొన్నాడు తాతయ్య. తాతయ్య చేయదలంచుకొన్న పనిలో అతని దృక్పథంలో తప్పు కూడ యేమీ లేదు. అమ్మ పేరుతో భూమి కొన్నచో పెద్దనాన్నగారు, అతని సుపుత్రులు భాగానికి వచ్చినా రావచ్చు. తొలుత తన పేరుతో చేసుకొంటే కాలక్రమాన ఆ భూస్థితి తప్పక దౌహిత్రుడైన తనకు చెందక పోదని ఆయన విశ్వాసం. ఈ కారణాలచేత అమ్మ పేరుతో పొలం ఉండడం మంచిపని కాదని అతని ఉద్దేశం.

> కొడుకు : “అమ్మా ఈ ఉత్తరం పోస్టుచేసివస్తానే”
>
> తల్లి: వద్దు బాబు ! ఈ చలిలో కుక్కలుకూడ వీధిలో తిరుగవు. మీ నాన్న వేసి వస్తారులే!”
>
> —షేక్ ఇక్‌బాల్ అహమ్మద్
> (చిత్రగుంట)

తన కుమార్తె జీవన భారమంతా పూర్తిగా వహించదలచుకున్న తాతయ్య తన పేరుతో ఆ పొలం చేసుకోడానికి నిశ్చయించాడు. తన తదనంతరం తన స్వార్జితమైన ఆస్తిలో కొంత,కరిణీకం తన అన్న కుమారుడైన ఆనందాని కిచ్చే మనో నిశ్చయం అతనిలో లేకపోలేదు. ఈ నిశ్చయం ఆయన పలుకులవల్ల అందరికీ విదితమైనదే.

ఒకవేళ తాతయ్య మరణించినట్లయితే నాన్న సొత్తుతో కొన్న భూమి అన్నకు సంక్రమిస్తుంది. అది మామూలు. కాని తన అన్నంటే—పెదనాన్న కుమారుడు ఆనందం అంతకు పాల్పడుతాడా ? ఎన్నటికీ పాల్పడడు. కానీ, తన ఒదిన నల్లతంగ. ఒదినె. “మూళి అలంకారి—మూదేవి శొండాళి' లాంటిది. అన్నయ్య ఒదినె చేతిలోని కీలుబొమ్మ ఆమె ఎట్లాడించిన అట్లాడగలడు. ఇంతకు ఆనంద మామయ్య భార్య ఒక స్వాధీన పతిక.

ఈలాంటి ఆలోచనలతో అమ్మ ఉక్కిరిబిక్కిరి అయ్యేది.

తన్నింకా దేవు డెందుకు జీవింప జెయ్యాలి ? అన్నగారి సంసారంలో అగ్నిభాండం తన కారణంగా లేవగూడదు కదా ! తాతయ్య తదనంతరం ఆస్థి వంశానుగతంగా అన్నయ్యకు చెందుతుంది. అన్నయ్య తనకివ్వాలన్నా యివ్వనియ్యదు ఒదినె. ఆమె నిస్పృహతో కృశించి పోయింది.

తండ్రిని సమీపించి తన పేరుతో ఆ పొలం రిజిష్టరు చేసి యిమ్మని కోరింది అమ్మ—తాతయ్య అపార్థం చేసుకొన్నాడు. భావి జీవితంలో అమ్మ వూహలు శిలాక్షరాలు అవుతాయని అతని కేం తెలుసు. ‘ఎవరి పేరుతో నుంటే యేం ? నీ క్కావలసిం దింత గుడ్డ, అంత అన్నం, యిదేనా ? నన్ను నమ్మలేవా అమ్మా' అని ఆక్రోశించాడు తాతయ్య. మరి యెదురుగా నిలువలేక పోయింది అమ్మ.

ఆ మరుదినం రిజిష్టర్సు పూర్తి అయి వచ్చిన పత్రాలు, పెట్టెలో పదిలంగా దాచి పెడుతూండడం చూచింది అమ్మ. ఎవరి పేరుతో రిజిష్టరైంది పొలం అని అమ్మ అడిగిందానికి తాతయ్య “కస్సు” మంటూ లేచిపోయాడు బయటికి.

‘ఎవరి పేరుతో అయితేనేం ?' అని ఒదినెగారన్నది. “రిజిష్టరు నా భర్త పేరుతో అయినది. అతడు చెప్పాడు. నీ తండ్రి మరణానంతరం నీకో చిల్లిగవ్వ కూడా దక్కదీ యింట్లో. ఎప్పుడూ కన్నీటితో మా యిల్లే ఏడ్పుల కొంపగా చేశావు. ఏ నూతిలో, గోతిలోనైనా పడి చావరాదూ ?” అన్నది ఒదినె.

ఇన్ని సంగతులు, వదినెగారన్న మాటలూ తాతయ్యకు నిజంగా తెలీదు. వృద్ధాప్యం మూలాన అమ్మమ్మకు ఆ పలుకులు స్పష్టంగా వినిపించినవి కావు. ఎంత పేచీ పెట్టినా, అమ్మ తాతయ్యతో చెప్పదన్న ధీమాతో గామాలు యిన్ని మాటలు అన్నది ఆనందంగారి భార్య !

“అవును, నిజం. ఆనాడే సహగమనానికి అంగీకరించలేదు తాతయ్య. ఆనాటి నుండి తనకు జీవితంపైన విరక్తి. ఎప్పుడూ దీర్ఘాలోచనలతో వేడి వేడి కన్నీటి కణాలు అప్రయత్నంగా చెక్కిళ్లపైన కారుస్తూ తన్ను చూచుకొని జీవించేది అమ్మ. వేసగి బిరెండచేత శుష్కమైన గడ్డిపోచలను రవంత అగ్నికణమే ప్రజ్వరిల్ల జేసినట్లు శోకమూర్తియై విరాగిణియై, జీవచ్ఛవంలా జీవిస్తూండే అమ్మకు ఒదినె అన్న మాటలు మంత్రాల్లా పనిచేసినై.

తా నెందుకు నుయ్యో గొయ్యో చూచుకోగూడదు ? నిజానికి నాన్న ధనంతో కొన్న ఆస్తి తన కుమారుడైన కృష్ణమూర్తికి అందదు. చెవి నిల్లు పెట్టుకొని ఘోషించినా, యీ విషయం తాతయ్యకు అర్థంకాదు. మొత్తానికి వైధవ్య భారంతో, వదినగారి అనాదరంతో, తండ్రిగారి అమాయకత్వంతో అమ్మ ఆ అర్ధరాత్రం ఒదినెగారి సలహా మేరకే—వో నుయ్యి చూచుకొనింది. అని లోకం కోడై కూసింది. ఆ కూతతో అమ్మ మరణించినందుకు కారణం ఆనాడు తెలిసింది కృష్ణమూర్తికి !

అమ్మ మరణానికి తనూ కొంతవరకు కారణ

హాలాహలంలో అమృతభాండం

భూతుడన్న తాతయ్య ఆ చింతతోనే అచిరకాలంలోనే స్వర్గధామా న్నలంకరించాడు.

నాలుగోయేట తండ్రిని, ఐదోయేట తల్లిని పరలోకానికి పంపిన తనకు అమ్మమ్మ అండయ్యి పోషించింది. అత్తయ్యకు తనంటే ఏమిటో జగుప్స. అమ్మ మరణించినా, తాతయ్య అంతరించినా, ఆనందంగారి భార్యకు హృదయంలోని ఆరాటం ఆగింది కాదు. అమ్మమ్మ అసలు భర్తృమరణంతో, పుత్రికా శోకంతో కృంగి, కృశించి తన్ను చూచుకొని రోజులు గడుపుతున్నది. అత్తయ్య చేసే అల్లరికి ఆ యింటిలో ఉండడం దుర్భరమ్మై అమ్మమ్మ తన్ను తీసుకొని తన తమ్ముని వూరు చేరుకొంది. తన పరిదీన దశను తన తమ్ముడు పద్మనాభరావుతో వెళ్లబోసుకుని, తల్లీ, తండ్రికి దూరమ్మైన నా, యీ దౌహిత్రుణ్ణి పైకి తేవలసిన భారం నీదని కాళ్లా, వేళ్లా బడి బ్రతిమలాడింది.

అక్కయ్య ఆవేదనను అర్థం చేసుకొన్న పద్మనాభరావుగారు ఆర్ద్రహృదయంతో కరిగిపోయాడు. సమీపమందలి బస్తీలో ఉన్నత పాఠశాలలో తన్ను చేర్పించి, అమ్మమ్మను తనకు అండగా నియమించి అన్ని ఖర్చులూ ఆయనే భరిస్తూండేవాడు.

రోజులు, వారాలు, నెలలు దొర్లి సంవత్సరాలుగా కాలచక్రం దొర్లుతూ శరవేగంతో అప్పుడే పదేండ్లు కావచ్చింది తన బస్తీ జీవితం. తనప్పుడు ఎస్. ఎస్. ఎల్. సి. చదివే రోజులు. టైఫాయిడ్ ఫీవర్ రావడంచేత పాఠశాలకు ఆగవలసి వచ్చింది తను. అమ్మమ్మ చెవిలోని కమ్మలు, మెడలోని కంటె అమ్మి డాక్టరుకు ఫీజు చెల్లించిందట. పద్మనాభరావుగారు అప్పుడప్పుడూ వచ్చి పరామర్శించి పోతూండేవాడట. సుమారు ఒకటిన్నర నెల పర్యంతం దివారాత్రముల తేడా తన కష్టే తెలిసి రాలేదు. నయమైన కొద్దీ, డాక్టరు "కృష్ణమూర్తీ! యమధర్మరాజునే జయించావయ్యా" అనేవాడు. అమ్మమ్మ చిక్కి శల్యమైపోయింది. లోతైన కన్నుల్తో, బరువైన హృదయంతో ఆ మాతృహృదయం కంపించేది. ఆమె ఆ పరిస్థితిలో ఒంటరిగా రోగిష్టి అయిన తనతో యేలా గడిపిందో నని తలంచుకొన్న కొద్దీ గుండె చెరువై పోయేది.

ఇంత జబ్బు పడ్డా, తాను యథాతథంగా పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యాడు. కళాశాలలో ప్రవేశించి కళాశాల విద్యాపూర్తి గావించి ట్రెయినింగ్ కాలేజీలో చేరాడు తను. ఒక్క సంవత్సర కాలం అట్టే దొర్లి పరీక్షలు ముగిసినై.

అదివరకే తను ఉద్యోగానికి అప్లయి చేశాడు. టెలిగ్రాం అర్జంటువచ్చింది ట్రెయినింగ్ కాలేజినుండి రిలీవైన దినమే! సుదూర ప్రాంతాల్లో బస్తీలో తన్నో ఉన్నత పాఠశాలలో సైన్సు అసిస్టెంటుగా పోస్టు చేశారు. అమ్మమ్మ యీ వార్త విన్నప్పుడు ఆమె కన్నులు ఆర్ద్రాలైనాయి. ఆనందాశ్రువులు రెండు అమ్మమ్మ చెక్కిళ్ళపై చింది జారిపోయినై. "బాబూ, యిదంతా ఏడుకొండలవాని దయ నాయనా" అన్నది అమ్మమ్మ. పద్మనాభరావు గారికి శుభవార్తను వెంటనే టెలిగ్రాం మూలంగా అందజేసి మొదటి తరగతి రైలు పెట్టెలో అమ్మమ్మను ఎక్కించుకొని ఉద్యోగానికి బస్తీకి వెడుతున్నాడు తను. మందమందంగా రైలుబండి కిటికీలలో నుండి సమీరుడు లోని ప్రయాణీకులకు పంకా వేస్తున్నాడు. అమ్మమ్మ దేవతలాంటి మనిషి. అమ్మమ్మ లేకుంటే తనింతటివా డయ్యేవాడు కాడు, అన్న భావన తన కానాడే కల్గింది. అందుకే అమ్మమ్మను పూవుల్లో పెట్టి పూజించాలని తనప్పుడప్పుడూ అనుకునేవాడు.

బస్తీలో ఉన్నత పాఠశాలలో ఉద్యోగం బాగానే ఉంది. తోడి పంతుళ్ల సౌభ్రాతృత్వంతో, ప్రధానోపాధ్యాయుల ప్రసన్న హృదయంతో తన నిరంతర దీక్షాబద్ధమైన బోధనాపటిమతో ఖ్యాతి సంపాదించడానికి ఎంతో కాలం పట్టలేదు తనకు. ఎస్. ఎస్. ఎల్. సి. లో దాదాపు ముప్పైరెండు మంది విద్యార్థులు, ఎనమండుగురు విద్యార్థినులు ఉన్నారు. అందు నీరజ అనే అమ్మాయి సైన్సు పాఠాల్లో వీక్‌గా ఉండడం తను గమనించాడు. ఏలనో తన హృదాంతరాళంలో తనకు తెలీకనే మమత ప్రభవించి తాను ఆమెపట్ల ఆప్యాయతతో నడుచుకొనేవాడు. సైన్సు పాఠాల్లో తాను స్పెషల్ కోచింగ్ యిస్తానని, యింటికి వచ్చి నేర్చుకోమని చెప్పాడు నీరజకు. సమీపించే పరీక్షా సంద్రంలో తెప్పలా దొరికాడు కృష్ణమూర్తి అనుకొన్నది నీరజ!

నీరజ వదనము వేయి రేకులు విరియించిన, మిత్రుని వైపు నిరీక్షించే నీరజమే! .... శరీరంలోని దేహకాంతి .... నిగ్గు తీని, ఆమె అవయవాలతో ప్రతిఫలించి సౌదామినీగాత్రిగా ఆమె తనువును మార్చివేసింది. ఆమెకు విజ్ఞాన శాస్త్రంలో పాఠాలిస్తూ, ప్రేమ పాఠాలు ఆమెకి వల్లించాలనుకొన్నాడు తను. నీరజ అప్పుడప్పుడూ అమ్మమ్మకు తాను వలదన్నా, విరామం కలిగినప్పుడల్లా పనిపాటల్లో సాయపడి వెళుతూండేది. పరీక్షలు ముగిసినై. బాగా వ్రాశానని తృప్తిపడింది నీరజ.

> రోగి-ఏమండీ, "ఒక్క డోసు మందుతో నా జబ్బుతగ్గిపోతుందంటారా?"
>
> డాక్టరు-తప్పకుండా! ఇంత వరకూ రెండవ డోసుకోసం నా దగ్గరకు ఎవ్వరూ రావడం జరగలేదు.
>
> రిమాజ్ పాషా (కాకినాడ)

ఆనాడు తన్ను సమీపించి "మీ ఋణం ఎలా తీర్చుకోగలను పంతులుగారూ!" అంటుంటే తను ఆమెచేలాంచలాన్ని పట్టుకొని చేరువకు తీసుకొన్నాడు.

"నీ—ర—జా నిన్ను ప్రేమిస్తున్నాను. నా జీవితం అంధకార బంధురం చేయకు" అన్నాడు డగ్గుత్తికతో తను. నిశ్శబ్దం తాండవించింది యిరువురి మధ్య.

తనో మాతృవిహీన, దీన అయిన ఒక అభాగిని. ఏకైక పుత్రిక ఐన తనకై తన తండ్రి వేయి కండ్లతో నిరీక్షిస్తూంటాడని, అతని సంకల్పానికి వ్యతిరేకంగా నడచుకోడం తన కిష్టంలేదని, కానీ, తన మాటను నిరాదరించే కఠినుడు మాత్రం తన తండ్రి కాడని ఆమె చెప్పింది.

ఆ మాటల్నిబట్టి ఆమె హృదయం తనతో లంకె పడ్డదని తానానాడు గ్రహించాడు. పరీక్షలు ముగిసినా, రోజూ సాయంత్రం నీరజ తన గృహానికి రావడం తనకూ ఉల్లాసాన్ని కలిగించేది. ఒకనాటి సాయంకాలం నీరజతో తాను యింటి వెనుక వరండాలో ఉండగా వీధి గుమ్మంలో నుండి ఒకతను లోపల ప్రవేశించడం లీలామాత్రంగా కిటికీ వూచలలో నుండి కనిపించింది. ఆ ఆగంతకుడు అమ్మమ్మను జూచి బావురుమన్నాడు. తన భార్య మరణించిందని, తన పుత్రిక నీరజ యిక్కడ చదువుతూందని, అమ్మమ్మతో యేమేమో చెబుతూన్నాడు. నీరజ ఆతురతతో లోనికి పోబోవ తాను వారించాడు.

"ఏరా ఆనందం! గడచిందేదో గడచింది. అబ్బాయి కృష్ణుడు ఉన్నత పాఠశాలలో పంతులుగా ఉంటున్నాడు. నీ కుమార్తె నీరజను .... అని అర్ధాంతరంలో ఆగింది అమ్మమ్మ. అంతకంటే కావలసిం దేమిటమ్మా నాకు. అపుత్రకుడైన నా యావదాస్తీ ఆమెకారణంగా యిచ్చి కృష్ణమూర్తికి వివాహం చేస్తాను. గానీ కృష్ణమూర్తి తన్ను క్షమిస్తాడా" అని అమ్మమ్మతో అంటున్నాడు.

సాయంకాలం తూర్పు కొండపై నిండు చంద్రుడు ప్రభవించాడు. శరజ్జ్యోత్స్నలో నీరజ మెరిసిపోతోంది. కృష్ణమూర్తి ఆమె చేతిని సున్నితంగా లాగి మృదువుగా ఆమె చెక్కిళ్లపై చుంబించాడు.

హాలాహలం లాంటి అత్తయ్యలో నుండి ఎలా ప్రభవించిందీ నీరజ అనే అమృత భాండం! అత్తయ్య పోలికలు గుణాల్లో గాని, రూపంలో గాని మచ్చుకైనా లేవీ నీరజలో అనుకొన్నాడు తను. మామయ్య వరాండాలోనికి రావడంతో స్తబ్దులై నిలుచున్న నీరజను, తనను చూచిన మామయ్య ముఖారవిందంలో వో మందహాసరేఖ కందళించింది.

ప్రక్కయింటి గదిలో విద్యార్థి కాబోలు "ఎంగిలి చోట సువర్ణ మబ్బినన్ తక్కక పెన్విషంబున సుధారస ముండిన గ్రాహ్య మండ్రు" అని కంఠస్థ పద్యం కలకంఠంతో వల్లించుక పోతూన్న సవ్వడి గాలిలో లీలామాత్రంగా వినిపిస్తోంది. ఆనాటి మధుర సంఘటన లెన్నో యింకా కృష్ణమూర్తిగారి భావాంబర వీధిలో లీలామాత్రంగా యిలా మెదిలిపోతూంటాయ్. ★